# తల్లడిల్లిన తల్లులు.. కన్నీరైన గుండెలు

**• కొడుకా..పాణం అరచేతిల వెట్టుకున్నం**

ఫొటోలు: బందిగె గోపి, సన్నాయిల శ్రీకాంత్



'కొడుకా మీరు మల్లొస్తరని అనుకోలే.. మిమ్మల్ని మల్లా సూత్తననుకోలే.. మాయదారోళ్లు మిమ్మల్ని తీస్కవొయి మమ్మల్ని ఆగం జేసిండ్రు. మిమ్ములను ఏం జేస్తరేమోనని బుగులైంది కొడుకా.. పానం అరచేతిల వెట్టుకొని బతికినం నాయనా...!' సంగారెడ్డి జిల్లా కంది జైలు నుంచి విడుదలై లగచర్లకు వచ్చిన రైతులను పట్టుకొని ఏడుస్తున్న తల్లులు.

**• బిడ్డా మిమ్మల్ని మల్ల చూస్తననుకోలే..**

'బిడ్డలారా.. మిమ్మల్ని మల్ల చూస్తననుకోలే.. ఇన్నాళ్లూ దినమొక గండంగా గడిచింది. మీరు ఎట్లున్నరోనని ఏడ్వని రోజులేదు..' లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం కుమార్తెలను పట్టుకొని రోదిస్తున్న రైతు.



## రేవంత్‌రెడ్డి కుట్రతోనే రైతులపై కేసులు



రైతులను అక్రమ కేసుల్లో ఇరికించి, జైలులో పెట్టడం అన్యాయం. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశ పూర్వకంగా రైతులను జైలుపాలు చేశారు. బీఆర్‌ఎస్ న్యాయపోరాటం ఫలితంగా 17 మంది రైతులకు బెయిల్ వచ్చింది. మిగతా రైతులకు కూడా బెయిల్ వచ్చేలా న్యాయపోరాటం చేస్తాం. రైతులపై ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలి. రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుంది. **-చంటి క్రాంతి కిరణ్, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే**

## అన్యాయంగా అరెస్టు చేశారు



లగచర్ల ఘటనలో నేను దాడికి పాల్పడలే దు. కానీ నన్ను అరెస్టు చేసి చిత్రహింస లకు గురిచేశారు. నా భార్య గర్భవతి. ఆమెను చూసుకునేందుకు ఎవరూ లేరని వేడుకున్నా కనికరించలేదు. పోలీసులు కొట్టిన దెబ్బలకు 4 రోజులు నడవలేకపోయాను. నా కు టుంబానికి కేటీఆర్ అండగా నిలిచారు. నా భార్యకు మెరుగైన వైద్యం అందేలా చూ శారు.

**- పత్లావత్ ప్రవీణ్, లగచర్ల రైతు**

## దినదిన గండం.. జైలు జీవితం



లగచర్ల ఘటనాస్థలంలో నేను లేకపోయినా పోలీసులు అరెస్టు చేశారు. పొలం పనులు చేసుకొని ఇంటికొచ్చి నిద్రిస్తున్న నన్ను డోర్లుకొట్టి లేపారు. అక్రమంగా అరెస్టు చేసి హింసించారు. జైలులో ప్రతీరోజు గండంలా గడిపాను. కాంగ్రెస్ ప్రభుత్వానికి మా ఉసురు తగులుతుంది. అక్రమ కేసులు ఎత్తివేయాలి.

**- దోరమణి బాలకిష్టయ్య, లగచర్ల రైతు**

## లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి



రైతులపై రేవంత్ సర్కార్ అక్రమంగా కేసులు బనాయించింది. కేటీఆర్ సూచన మేరకు బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ రైతుల పక్షాన న్యాయపోరాటం చేసింది. రైతుల కోసం బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుంది. రైతులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే సహించేదిలేదు.

**- శుభప్రద్ పటేల్, బీఆర్‌ఎస్ సీనియర్‌నేత**



**• నిలిచినం.. గెలిచినం**

కంది జైలు నుంచి రైతులు విడుదల కావడంతో హర్షం వ్యక్తంచేస్తూ నినాదాలు చేస్తున్న లగచర్ల, పులిచర్లకుంటతండా, రోటిబండతండా గ్రామస్తులు



**• ఇది అన్నదాత విజయం**

జైలు నుంచి విడుదలైన అనంతరం నినాదాలు చేస్తున్న లగచర్ల, పులిచర్లకుంటతండా, రోటిబండతండా రైతులు

## ప్రాణం పోయినా భూములు ఇయ్యం



అర ఎకరం భూమి అమ్మి ఇల్లు కట్టుకున్నా. ఫార్మా కంపెనీకి భూమి ఇవ్వమంటే ఎలా ఇస్తాం. ప్రాణాలు పోయినా సరే మా భూములు ఇయ్యం. గుండెనొప్పి ఉందని చెప్పినా పట్టించుకోలేదు. కంది జైల్లో గుండెనొప్పి వస్తే బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లారు. తీవ్ర ఆవేదనతో చచ్చి బతికా. అక్రమ కేసులను ఎత్తివేయాలి.

**- హీర్యా నాయక్, పులిచర్లతండా**

## జైల్లో పెట్టి ఏం సాధించారు?



లగచర్ల ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు. నన్ను ఎందుకు అరెస్టు చేశారో ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఘటన జరిగిన రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నా కోళ్లఫారంలో పని చేసుకుంటూనే ఉన్నా. మా కుటుంబాన్ని రోడ్డుపైకి తీసుకొచ్చి అన్యాయం చేశారు.

**- విష్ణువర్ధన్‌రెడ్డి, లగచర్ల రైతు**



**• సినతల్లి గెలిచింది..**

'బావ.. మన బిడ్డ భూమ్మీదకు వచ్చేలోపు నిన్ను బయటికి తేవాల్నని ఎక్కని మెట్లు లెవ్వు.. ఎవరెంత భయపెట్టినా బుగులువట్టలే... అన్న కేటీఆర్‌ను కలిసిన..మాటిచ్చిండు..నిన్ను బయటికి తెచ్చిండు.' జైలు నుంచి విడుదలై ఇంటికొచ్చిన పులిచెర్లకుంటతండా యువరైతు ప్రవీణ్‌కు అన్నం తినిపిస్తున్న భార్య జ్యోతి

**• బిడ్డా ఎన్నిదినాలయే..**

'బిడ్డా ఎన్నిదినాలయేరా.. నువ్వు సక్కంగ బువ్వ తిని.. గా జైలులో కడుపు నిండ తిన్నవో లేదోనని నీ పిచ్చితల్లి ఏడ్వని దినం లేదు.. నువ్వు ఎప్పుడొస్తవని కనిపించిన మనిషినల్లా అడిగిన.. నువ్వు వచ్చే వరకు ఎట్ల గడిచినయో ఈ పాడు రోజులు.' జైలు నుంచి విడుదలై ఇంటికి చేరుకున్న రోటిబండతండా రైతుకు అన్నం తినిపిస్తున్న తల్లి





**• బుగులైంది నాన్నా..**

'నాన్నా..ఎట్లున్నవే..నిన్ను జైల్లో పెట్టిననుంచి మాకు భయమైంది. నిన్ను ఏం చేస్తారేమోనని టెన్షన్ పడ్డ. నువ్వు జైల్లో ఉన్నన్ని రోజులు పాణమంతా నీ దిక్కే కొట్టుకున్నది. గీ మాయదారి సర్కారోళ్లు ఏం జేస్తరోనని బుగులైంది..నాన్నా..' - సంగారెడ్డి జిల్లా కంది జైలు వద్ద విడుదలైన తండ్రిని పట్టుకొని ఏడుస్తున్న కూతురు

## ముంబయిలో ఉంటాను



ఉపాధి కోసం ముంబయిలో పని చేసుకుంటూ ఇటీవలే ఇంటికి వచ్చాను. అసలు కేసు ఏమిటో కూడా నాకు తెలియదు. పోలీసులు నన్ను ఇంటి నుంచి తీసుకెళ్లారు. జైల్లో పెట్టి నా పొట్టమీద కొట్టారు. తీవ్ర మానసిన ఆందోళనకు గురిచేశారు.

**- వినోద్ రాథోడ్, లగచర్ల రైతు**



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ లీగల్‌సెల్, గిరిజన నాయకులు

# భూముల కోసం దేనికైనా సిద్ధం

- **నాడు ఫార్మా, నేడు పారిశ్రామిక కారిడార్ పేరిట సర్కారు కుట్ర**
- **నిప్పులు చెరుగుతున్న కొడంగల్ బాధిత రైతులు**

కొడంగల్, డిసెంబరు 20 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలోని గిరిజన రైతుల నుంచి ప్రభు త్వం భూములు లాక్కునేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫార్మా విలేజ్ అయినా, పారిశ్రామిక కారిడార్ అయినా భూములు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భూమి ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. రోటిబండతండా వెళ్లిన బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ నేతలు నర్సింహనాయక్, బీఆర్‌ఎస్వీ సంగారెడ్డి కోఆర్డినేటర్ రాజేంద్రనాయక్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ రైతులతో మాట్లాడారు. సీఎం రేవంత్ మూర్ఖత్వంతోనే రైతులకు సంకెళ్లు వేశారని నిప్పులుచెరిగారు. రైతులకు అండగా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## సీఎంకు మేం ఏం పాపం చేశాం



జైలులో ఉన్నప్పుడు బాధతో నా భర్త హీర్యానాయక్‌కు గుండెపోటు వచ్చింది. ఆయనకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్నప్పుడు కూడా నా భర్తను చూసేందుకు పోలీసులు అనుమతివ్వలేదు.

**-దేవీబాయి, పులిచెర్లకుంటతండ**

## న్యాయం గెలుస్తుంది



నా కొడుకు పత్లావత్ శ్రీను లగచర్ల ఘటన జరిగిన రోజు కొత్త ఆటో రిజిస్ట్రేషన్ కోసం వికారాబాద్ ఆర్టీవో ఆఫీస్‌ను వెళ్లి సాయంత్రం వచ్చాడు. గొడవ సంగతి నా కొడుకుకు ఏమీ తెలియదు. అయినప్పటికీ పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది.

**-రత్నాబాయి, రోటిబడందతాండ**

# తెగిన సర్కారు సంకెళ్లు
# చెరవీడిన లగచర్ల రైతులు

- **కంది జైలు నుంచి 17 మంది విడుదల**
- **37 రోజులు జైలులో మగ్గిన రైతులు**
- **కుటుంబసభ్యులను చూసి కన్నీటిపర్యంతమైన అన్నదాతలు**
- **సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు**
- **కుట్రపూరితంగా కేసులు పెట్టారని రైతుల ఆగ్రహం**
- **భూములు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన బాధిత రైతులు**
- **జైలు నుంచి విడుదలైన రైతులకు బీఆర్‌ఎస్ నేతల ఘనస్వాగతం**



రైతులకు స్వాగతం పలుకుతున్న ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, నాయకులు శుభప్రద్ పటేల్, కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మధు, రాజేందర్‌నాయక్ తదితరులు

సంగారెడ్డి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలు నుంచి ఫార్మా విలేజ్ బాధిత రైతులు శుక్రవారం విడుదలయ్యారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి చేశారన్న ఆరోపణల కేసులో జైలులో ఉన్న 17 మంది రైతులు 37 రోజుల తర్వాత జైలు నుంచి బయటకువచ్చారు. గురువారం రాత్రి బెయిల్ పత్రాలు అందడంతో జైలు అధికారులు ఉదయం 8గంటలకు లగచర్ల రైతులను విడుదల చేశారు. జైలు నుంచి విడుదలైన వారిలో రోటిబండతండాకు చెందిన పత్లావత్ వినోద్, బాస్యానాయక్, రాథోడ్ వినోద్, జర్పుల హీర్యానాయక్, పత్లావత్ శ్రీను నాయక్, లగచర్లకు చెందిన ఎదురింటి శివకుమార్, బసప్ప, నీలి రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, రాఘవేందర్‌యాదవ్, లక్ష్మయ్య, హకీంపేటకు చెందిన దోరమని రమేశ్, దోరమని బాలకిష్టయ్య, మాణిక్యం శ్రీశైలం, పులిచర్లతండాకు చెందిన హీర్యానాయక్, పత్లావత్ ప్రవీణ్‌నాయక్ ఉన్నారు. జైలు గేటు దాటగానే ఎదురుగా కనిపించిన కుటుంబ సభ్యులు, స్నేహితులను చూసి రైతులంతా భావోద్వేగానికి గురయ్యారు. గుండెలకు హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చామన్న ఆనందం, తప్పు చేయకున్నా కాంగ్రెస్ సర్కార్ కటకటాలపాలు చేసిందన్న ఆక్రోశం రైతుల కళ్లల్లో స్పష్టంగా కనిపించింది. బీఆర్‌ఎస్ నాయకులు క్రాంతి కిరణ్, శుభప్రద్‌పటేల్, ముఖ్యనేతలు రైతులకు ఘనంగా స్వాగతం పలికారు. రైతులంతా రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ నిరంకుశం నశించాలి, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అడుగడుగునా అండగా నిలిచారంటూ బీఆర్‌ఎస్ జిందాబాద్, కేసీఆర్, కేటీఆర్ జిందాబాద్ అని నినదించారు. ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జైపాల్‌నాయక్, నాయకులు గోపీనాయక్, వినోద్‌నాయక్‌లు గిరిజన రైతులను సన్మానించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రైతులతో ఫోన్‌లో మాట్లాడి, అభినందించారు. జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న రైతులను పోలీసులు అడ్డుకుని మరోసారి తమ దురుసుతనాన్ని ప్రదర్శించారు. మీడియాతో మాట్లాడుతుంటే అడ్డుకోవడమేంటని బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ నేతలు ప్రశ్నించడంతో పోలీసులు వెనక్కి తగ్గారు.



వికారాబాద్ జిల్లా పులిచెర్లకుంటతండాలో జైలు నుంచి వచ్చిన రైతులతో సమావేశమైన గ్రామస్థులు

# మళ్లీ రైతుల అరెస్టుకు ప్లాన్?

- **తండాల్లో తాండవిస్తున్న భయానక వాతావరణం**
- **ఆత్మీయులతో బాధలు పంచుకున్న అన్నదాతలు**
- **అండగా నిలిచిన బీఆర్‌ఎస్‌కు రైతుల కృతజ్ఞతలు**

వికారాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని సర్కారుపై ఎదురుతిరిగిన రైతులు న్యాయపోరాటంలో బెయిల్ పొందారు. స్వేచ్ఛగా స్వగ్రామాలకు చేరినప్పటికీ రైతులను భయం వీడలేదు. ప్రభుత్వం మరో కేసు లో అరెస్టు చేస్తుందని లగచర్ల పరిసర తండాల్లో ప్రచారం జరుగుతున్నది.

**మళ్లీ అరెస్ట్‌కు రంగం సిద్ధం...!**

జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన రైతులను పోలీసులు మళ్లీ అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడిపై దాడి కేసును పోలీసులు తెరపైకి తెచ్చే యోచనలో ఉన్నారని సమాచారం. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 8 మంది రైతుల కుటుంబాలు బిక్కుబిక్కుంటూ ఉన్నాయి.

**గిరిజన రైతుల్లో భయం భయం**

ప్రభుత్వానికి ఎదురుతిరిగిన లగచర్ల, పోలేపల్లి, హకీంపేట, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో ప్రజలు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. కుటుంబసభ్యులు జైలు నుంచి వచ్చారని ఆనందంగా ఉన్నప్పటికీ లోలోపల భయంతోనే బ్రతుకుతున్నారు. పోలీసులు మళ్లీ ఏ క్షణాన వచ్చి ఊర్లపై విరుచుకుపడుతారో అని ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమల కారిడార్‌కు ప్రభుత్వం 1278 ఎకరాలకు భూసేకరణ చేపట్టేందుకు ప్రస్తుతం హకీంపేట, లగచర్ల, పోలేపల్లి గ్రామాలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. ప్ర జాభిప్రాయ సేకరణ నిర్వహించకుండానే గు ట్టుచప్పుడు కాకుండా అధికారులు భూసేకరణ ప్రక్రియ చేపట్టారు.

**ఆత్మీయులతో సాధకబాధకాలు**

జైలు నుంచి విడుదలైన రైతులు ఆత్మీయులను కలుసుకుని సాధకబాధకాలు చెప్పుకున్నారు. మాజీమంత్రి కేటీఆర్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో తమకు న్యాయం జరిగిందని కృతజ్ఞతలు తెలిపారు.